క్లుప్తంగా

ఆరోగ్య సంరక్షణలో కీలకంగా ఏఐ


ప్రొఫెసర్ భవానీరావు

కాకినాడ క్రైం: ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఓ తిరుగులేని శక్తిగా అవతరించనుందని గీతమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్‌సర్) సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భవానీరావు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ బృందం పర్యవేక్షణలో జీజీహెచ్‌లోని ఎస్‌పీఎం గ్యాలరీలో నిర్వహించిన గెస్ట్ లెక్చర్‌కు డాక్టర్ భవానీరావు వక్తగా హాజరయ్యారు. అప్లికేషన్ ఆఫ్ ఏఐ ఇన్ మెడిసిన్ అంశంపై కీలక ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, వైద్య శాస్త్ర అనుబంధ సాంకేతిక విప్లవంలో ఏఐ కీలక ముందడుగుగా అభివర్ణించారు. ఎన్నో దేశాల్లో వైద్య సేవల ముఖచిత్రాన్నే మార్చేసిందన్నారు. రోగులకు అత్యుత్తమ ఫలితాలు చేకూరాయని వెల్లడించారు. వైద్యంతో పాటు, కీలక శస్త్రచికిత్సలు, వ్యాధి నిర్ధారణ, నివారణ, మందుల తయారీ, వినియోగాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మానవ తప్పిదాలకు ఆస్కారం ఉండదని తెలిపారు. వైద్య విద్యార్థులు ఏఐ అనుబంధ వైద్య సేవల విస్తరణపై దృష్టి సారించాలని చెప్పారు. సాంకేతిక విప్లవం ఏ పాటిదైనా, మనిషి మేథస్సుకు అతీతం కాదన్నారు. ఆయనను రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు ఏ.విష్ణువర్ధన్, దేవీ మాధవి సత్కరించారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి సాయం


బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్, షిప్పింగ్ సంస్థల సభ్యుల సహకారంతో ఓ కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థికసాయం అందించారు. స్థానిక సాంబమూర్తినగర్‌కు చెందిన కె.శివరాంబాబుకు వైద్యం కోసం రూ.1,27,500 ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కమల్ సందీప్ మాట్లాడుతూ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న శివరాంబాబు వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకుని ఈ సాయాన్ని అందించామన్నారు. క్లబ్ సభ్యులు శ్రీకృష్ణ, వర్మ, ఏవీ రంగారావు, వి.నగదర్, వి.శ్రీనివాస్, టి.సాయిసుందర్, బాలాజీ, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం ఎంపీటీసీపై దాడి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం ఎంపీటీసీ గుత్తుల శ్రీనుపై అదే గ్రామానికి చెందిన రాయుడు గణేష్ శనివారం దాడికి పాల్పడ్డాడు. శ్రీనివాసరావు ఇంటి వద్ద మట్టి వేసుకున్న చోట గణేష్ బైక్‌ను పార్కింగ్ చేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఎంపీటీసీపై గణేష్ దాడి చేసి గాయపరిచాడు. గాయపడిన శ్రీనివాసరావును చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపారు.

పోలీసుల పాత్ర ఎంతో కీలకం


పోలీస్ స్టేషన్‌కు కంప్యూటర్‌ను అందిస్తున్న రిక్కీ గూటం

బోట్‌క్లబ్: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు రిక్కీ గూటం అన్నారు. కాకినాడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు కౌన్సిల్ సౌజన్యంతో శనివారం డెస్క్‌టాప్ కంప్యూటర్‌ను అందించారు. అహర్నిశలు పౌర రక్షణకు శ్రమిస్తున్న పోలీస్ యంత్రాగానికి సామాజిక బాధ్యతగా ఈ కంప్యూటర్‌ను అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ట్రెజరర్ పాల్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి శివారు ప్రాంతాలకు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. తూరంగి డ్రైవర్స్ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, సామర్లకోట రోడ్డు విస్తరణ సందర్భంగా ఇచ్చిన కాలనీలకు ప్రత్యేక పైపులైన్లు వేసి ఇబ్బందులు తొలగించారు. ప్రత్యేక వాల్వులు వేసి నీటిని అందించే చర్యలు చేపట్టారు. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతీరామ్, పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి మాట్లాడుతూ ప్రత్యేక పైపులైన్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపరిచినట్టు తెలిపారు.

యండమూరులో సీఐ పర్యటన

కరప: సమస్యాత్మక గ్రామమైన యండమూరులో శనివారం రాత్రి కరప ఎస్సై టి.రామకృష్ణ, ఏఎస్సై వి.సూరిబాబు, సిబ్బందితో కల్సి కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ పర్యటించారు. పోలింగ్ స్టేషన్లను, అక్కడి వసతులను పరిశీలించారు. అనంతరం ప్రజలతో సమావేశమై ఎన్నికలపై అవగాహన కల్పించారు.

పండంటి బిడ్డకు మూడు సూత్రాలు

- మూడు ప్రొటోకాల్స్‌తో తల్లీబిడ్డ సురక్షితం
- ఆదిలోనే మరణాల కట్టడికి క్షేత్ర స్థాయి చర్యలు
- ప్రాథమిక వైద్య సేవల నుంచే పటిష్టత
- వైద్య, ఆరోగ్య యంత్రాంగం సుదీర్ఘ కసరత్తు


మూడు ప్రొటోకాల్స్ విధానాలను అవలంబించి స్థానిక ఆరోగ్య కేంద్రంలో సురక్షిత ప్రసవం చేసిన మెడికల్ ఆఫీసర్

కాకినాడ క్రైం: మాతాశిశు మరణాల నియంత్రణ సంతృప్తికర స్థితిలో కొనసాగుతున్నా, సున్నా దశకు చేర్చేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ శ్రమిస్తోంది. మాతాశిశు మరణాలు లేని ప్రసవాలే లక్ష్యంగా ప్రత్యేక చర్యలకు సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశంలో కట్టుదిట్టమైన చర్యలతో కార్యాచరణను సిద్ధం చేసింది. గత చర్యలకు భిన్నంగా, ఫలవంతంగా ఉండేలా శాస్త్రీయ విధానాలను రూపకల్పన చేసింది. వీటిలో కీలక విధానమే ప్రొటోకాల్స్ నిర్వహణ. స్థానిక ఆరోగ్య కేంద్రాల నుంచే వీటిని నిర్వహిస్తూ, ప్రసవంలోను ఏ తల్లీ, ప్రసవానంతరం ఏ బిడ్డ ప్రాణాపాయానికి గురికాకూడదనే సంకల్పంతో అమలుకు సంసిద్ధమైంది. అందుకు వైద్యారోగ్య యంత్రాంగాన్ని సిద్ధం చేస్తూ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

మూడు ప్రొటోకాల్స్

మాతాశిశు మరణాల నియంత్రణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి నుంచి తగిన నియంత్రణ చర్యలు చేపట్టడమే ప్రొటోకాల్స్ లక్ష్యం. ఈ ప్రొటోకాల్స్‌లో ఏఎన్ఎం నుంచి స్పెషలిస్టుల వరకూ భాగస్వామ్యులవుతారు. వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక విధుల కోసం కేటాయించబడతారు. వీరందరి ఏకైక లక్ష్యం తల్లీబిడ్డల సంరక్షణే.

మూడింటి వల్లే మరణాలు


ప్రసవానంతరం బాలింత, శిశువుకి వైద్య, ఆరోగ్య సిబ్బంది సపర్యలు


మూడు ప్రొటోకాల్స్ విధానంపై జరిగిన శిక్షణలో సర్టిఫికెట్ పొందుతున్న వైద్యాధికారి

రక్తహీనత, మధుమేహం, ఫిట్స్.. ఇవే మాతృ మరణాలకు ప్రధాన కారణం అధిక సంఖ్యలో మాతృమరణాలకు తద్వారా శిశువు ఉనికిపై ఇవే ప్రభావాన్ని చూపుతున్నాయి. అయితే, ఇవేవీ ప్రాణాంతకం కాదు. కానీ గర్భధారణ సమయంలో వీటి పాత్ర అత్యంత కీలకం. హెచ్చుతగ్గులు సైతం గర్భిణి లేదా శిశువు జీవాన్ని నిర్ణయిస్తాయి. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం నియంత్రణ కేవలం నిర్లక్ష్యం వల్లే సాధ్యం కావట్లేదన్న చేదు నిజాన్ని వైద్యులు వెల్లడిస్తున్నారు. ప్రాథమిక దశలో ఆరోగ్య కేంద్రాలు వీటి నిర్వహణకు పూర్తిగా తోడ్పడతాయి. అక్కడ నియమించబడే వైద్య, వైద్యేతర సిబ్బంది, వైద్యాధికారులు వీటి నియంత్రణకు సమర్థంగా చికిత్స అందిస్తారు. అంతేకాక ఆయా సమస్యల నియంత్రణకు మందులు పుష్కలంగా అందుబాటు ఉన్నాయి.

ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఐదు డెలివరీలు

కనీసం ఐదు డెలివరీలు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెలా జరగాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. అందుకనుగుణంగా ప్రతి ఆరోగ్య కేంద్రాన్ని ప్రసూతి సదుపాయాలతో బలోపేతం చేసింది. మెడికల్ ఆఫీసర్లు సైతం పూర్తి నైపుణ్యంతో పురుడు పోస్తారు. వారి ఆరోగ్య స్థితిని పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తూ, సురక్షిత ప్రసవానికి శాయశక్తులా శ్రమిస్తారు. అలాగే ప్రతి గర్భిణికి గర్భధారణ సమయంలో కనీసం 180 ఐరన్ మాత్రలు మింగించేందుకు ఏఎన్ఎంలు తగిన చొరవ చూపుతారు. రిస్క్ ఉన్నప్పుడు ఎర్లీ డిటెక్షన్, ఎర్లీ ట్రీట్మెంట్, ఎర్లీ డెషిషన్ అనే మూడు విధానాల్లో తక్షణ వైద్య సేవల ద్వారా గర్భిణి ప్రాణాన్ని కాపాడేందుకు ముందుకు వస్తారు. ఆయా విధానాలన్నీ నూతనంగా అవలంబిస్తున్న మూడు ప్రొటోకాల్స్ విధానంలో సమ్మిళితమై ఉంటాయి.

> **వైద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ**
>
> 
>
> మూడు ప్రొటోకాల్స్ విధానంపై పూర్తిస్థాయి అవగాహన పెంచేందుకు డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ఆయన అధ్యక్షతన, ఎర్మన్ ఎన్‌జీఓ సహకారంతో ఈ తరగతులు కొనసాగుతున్నాయి. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులుగా కొనసాగుతున్న వీరంతా ఈ విధానంపై అవగాహన పొంది, గర్భిణుల సంరక్షణ కోసం పనిచేస్తారు. అపాయకర స్థితిలో ఉండే గర్భిణుల సంరక్షణ నుంచి రిస్క్ దశకు చేరుకోని సురక్షిత ప్రసవాన్ని పొందేందుకు అవలంబించాల్సిన అన్ని వైద్య విధానాలను వివరించాం. తొలి దశ శిక్షణ ఇప్పటికే పూర్తి చేశాం. స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ విధానంలోనే సురక్షిత ప్రసవాలు జరుగుతున్నాయి.
>
> – డాక్టర్ కన్నీడి రత్నకుమార్, డీఐఓ, నోడల్ ఆఫీసర్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ కంట్రోల్ టీం

మూడు దశల్లో సంరక్షణ

- ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్, స్పెషలిస్టు ప్రొటోకాల్ ద్వారా మూడు దశల్లో గర్భిణి, శిశువు ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తుంటారు. ఏఎన్ఎం సర్వే ద్వారా గృహ దర్శనాలు చేసి గర్భిణులను గుర్తిస్తారు. వారి బీపీ, మధుమేహ స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తారు. ఆరోగ్య స్థితికి అనుగుణంగా టీ, డీ ఇంజెక్షన్లు ఇస్తారు. ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ పూర్తిగా అందేలా చూస్తారు. ఎప్పటికప్పుడు స్థానిక వైద్యాధికారికి గర్భిణి లేదా బాలింత, శిశువు ఆరోగ్య స్థితిగతులను నివేదిస్తారు.
- రెండో దశలో మెడికల్ ఆఫీసర్ ప్రొటోకాల్ ప్రారంభమవుతుంది. ఈ దశలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మెడికల్ ఆఫీసర్లు గర్భిణులకు అందుబాటులో ఉంటారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎప్పటికప్పుడు వివిధ పరీక్షల ద్వారా ఆరోగ్య స్థితిని గుర్తిస్తూ, తగిన వైద్య సేవలందిస్తూ సురక్షిత ప్రసవానికి సిద్ధం చేస్తారు.
- గర్భిణిలో రిస్క్ గమనిస్తే స్పెషలిస్టు అందుబాటులోకి వస్తారు. ఇదే స్పెషలిస్టు ప్రొటోకాల్, బాధిత గర్భిణిని టెర్షరీ కేర్ లేదా సీహెచ్‌సీకి తరలించి, అల్ట్రాసౌండ్ సహా థియేటర్, అనస్థీషియా వంటి ముఖ్యమైన వైద్య సేవలు అందిస్తారు.

ఆస్పత్రికెళ్లి పింఛను అందజేత


ఆస్పత్రిలో నల్లా సూర్యకాంతంకు పింఛను ఇస్తున్న నాగేంద్రకుమార్, మహిళా పోలీసు దేవి

కరప: గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు అనారోగ్య కారణాలతో చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేరారు. కరపకు చెందిన నున్న అచ్చుతం, నల్లా సూర్యకాంతం, ముమ్మిడి వరలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ స్పందించి, మహిళా పోలీసు పడాల దేవితో కల్సి శనివారం ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. ఆస్పత్రిలో ఉండిపోవడం వల్ల పింఛను అందదేమోనని భయపడ్డామని, ఆస్పత్రికి వచ్చి మరీ పింఛను ఇచ్చి ఆదుకున్నారని లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఆస్పత్రికి వచ్చి పింఛను ఇచ్చిన దాఖలాలు లేవని, ఎక్కడున్నా పింఛను అందుతుండంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చలవేనని వారు తెలిపారు.

శ్రీవారి పాదాల్లోనే వైభవం

బోట్‌క్లబ్: అన్నమాచార్య సంకీర్తనలో పేర్కొన్న వైభవమంతా శ్రీవారి పాదాల్లో నిబిడీకృతమై ఉందని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం సుప్రభాత వేళ పీఠంలోని శ్రీవారి పాదాల వద్ద 23వ జపయజ్ఞ పారాయణ నిర్వహించారు. గోవింద సంకీర్తనలతో మానసిక ప్రశాంతత, ధర్మ పరివర్తన, సౌభాగ్య సిద్ధి కలుగుతాయన్నారు. పీఠం ఆధ్వర్యంలో గోవింద నామాల పది వేల పుస్తక ప్రతులు ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీవారి సేవా సమితి సభ్యులు వరలక్ష్మి, భారతికుమారి, పద్మ, రమ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి


ఉప్పలంకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న కన్నబాబు

- ఉప్పలంకలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కన్నబాబు ఇంటింటా ప్రచారం

కరప: ఉప్పలంక, శివారు మొండి గ్రామాల్లో శనివారం కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరింత అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి, తద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉప్పలంక నుంచి ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం చేపట్టారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, ఎంపీటీసీ కాలాడి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీనివాస్ తదితరులు మహిళలతో కల్సి ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆంజనేయ స్వామికి, రామాలయంలో, గ్రామ దేవత ఆలయంలో పూజలు చేసి, ఎమ్మెల్యే కన్నబాబు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా గ్రామంలో సచివాలయ, వెల్‌నెస్, ఆర్‌బీకే వంటి భవనాలు నిర్మించామని, రోడ్లు, డ్రెయిన్లు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. వాటర్ ట్యాంక్ నిర్మించి, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చామన్నారు. 370 మందికి ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చామన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ 24.05 కోట్లు లబ్ధిదారులకు అందించామన్నారు. గ్రామంలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి, ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం అందించామన్నారు. ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లిన ఐదు నావలు దెబ్బ తిన్నాయని మత్స్యకారులు తెలుపగా, ఎన్నికలయ్యాక బాధితులను ఆదుకునేందుకు అన్నిరకాలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలు మాయమాటలతో బురదచల్లేందుకు చూస్తారని, అవేమీ పట్టించుకోకుండా, ఐదేళ్లలో పొందిన లబ్ధిని చూసి ఓటేయాలని కోరారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వెలుగుబంటి సీతారామరాఘవ, వాసంశెట్టి రామారావు, మండల జేఎస్‌సీ కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.సీతామహాలక్ష్మి, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, పబ్బినీడి పాపారావు, వనుం గంగరాజు, జొన్నలగడ్డ కృష్ణమూర్తి, మార్నెళ్ల వెంకటరమణ, సాదే లోహిదాస్, అప్పనపల్లి పెద్ద, మూరా అవినాష్, తారకేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి మళ్లీ గెలిపించండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి


ఎన్నికల ప్రచారంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని గుర్తించి రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన 34వ డివిజన్ బ్యాంక్ పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో దాదాపు 96 వేల నివాసాలు ఉన్నాయని, ప్రతి ఇంటికీ వెళ్లి చేసిన అభివృద్ధిని వివరించి, మళ్లీ గెలిపించాల్సిందిగా ప్రజలను కోరతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నో సంక్షేమ ఫలాలను అందించారన్నారు. ఇక కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో ప్రతి డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో సహా, సకల మౌలిక సదుపాయలు కల్పించి ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం, వై ఏపీ నీడ్స్ జగన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమయ్యామని వివరించారు. ప్రజల నుంచి మంచి ఆదరణ కనిపిస్తోందన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే ద్వారంపూడికి అడుగడుగునా ప్రజలు హారతులిచ్చి, పూలమాలలతో స్వాగతం పలికారు. ప్రజల ఆశీస్సులతో మూడోసారి ఘన విజయం సాధించగలనన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి వెంట పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్ తెహరా ఖాతూన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు అజ్జు తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

కాకినాడ : సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం సాయంత్రం సినిమా రోడ్డులోని క్రౌన్ టాకీస్ వద్ద ఉన్న అక్సా మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ద్వారంపూడి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సర్వమత సమానత్వానికి, స్నేహభావానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు అంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాభినందనలు తెలిపారు. ఆయన వెంట మసీదు ప్రతినిధి, అక్మల్, ముస్లిం ప్రతినిధులు అబ్దుల్‌బషీరుద్దీన్, సాదిఖ్ దుర్రానీ, తాజుద్దీన్, జిత్రియా, షరీఫ్, ఇక్బాల్ ఆలీ, ఆలీషా, ఖాలీద్‌బిన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఎమ్మెల్యే ద్వారంపూడి సమక్షంలో జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కాకినాడ: మత్స్యకారులకు అన్ని విధాలా అండగా ఉంటానని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక దుమ్ములపేట ప్రాంతంలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 120 మంది శనివారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ మిత్ర బృందం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి నివాసం వద్ద వీరంతా పార్టీలోకి చేరేందుకు ముందుకు రాగా, ఎమ్మెల్యే వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో మత్స్యకారులు అధికంగా నివసించే దుమ్ములపేట ప్రాంతాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయగలిగామన్నారు. ఆ ప్రాంత ప్రజల కోసం స్థానికంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడంతో పాటు, రూ.11 కోట్లు వెచ్చించి అనేక మౌలిక సదుపాయాలు కూడా కల్పించామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం కోసం స్థానిక మత్స్యకారులు కష్టించి పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో వాసుపల్లి అప్పారావు, వాసుపల్లి రాము, గంట మోహన్, సూరాడ చిన్న, కోడా జగన్నాథం, మేరుగు మారమ్మ, వాసుపిల్లి దానమ్మ, గంటు ఎర్రమ్మ, దూడ సతీష్, వంకా విజయరావు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాకినాడ రూరల్: సద్గురు సాయి బాబా ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోరుకొండ రాంబాబు, మీనాక్షి దంపతులు స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ వద్దనున్న భక్తాంజనేయ ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజరు జ్యోత్స్న శనివారం ప్రారంభించారు.

సబ్ జైలు నుంచి పారుతున్న మురుగు


సబ్ జైలు నుంచి బయటకు ప్రవహిస్తున్న మురుగు

కాకినాడ లీగల్: కాకినాడ స్పెషల్ సబ్ జైలులో ఉన్న బాత్రూంల వేస్ట్ వాటర్ పైపులైన్లు ఇటీవల పగిలిపోయాయి. దీంతో ఆ మురుగు నీరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం మీదుగా ప్రవహిస్తోంది. తీవ్ర దుర్వాసన వెదజల్లుతుండడంతో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారులు, దస్తావేజు లేఖర్లు, కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సబ్ జైలు బాధ్యులకు లేఖర్లు, ఉద్యోగులు ఈ సమస్యను తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో వారం రోజులుగా ఈ సమస్య అలాగే ఉంది. సంబంధిత సబ్ జైలు అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

విజయం తథ్యం.. మెజార్టీ ముఖ్యం

వైఎస్సార్ సీపీ విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. హాజరైన పార్టీ నాయకులు

కాకినాడ: ప్రజా స్పందనను బట్టి విజయం ఖాయంగా కనిపిస్తోందని, మంచి మెజార్టీ సాధించే దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత కష్టించి పనిచేయాలని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డి కన్వెన్షన్‌లో శనివారం పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన పార్టీ నగర విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో 30 లక్షలు, కాకినాడలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణాలు కూడా చేపట్టామన్నారు. సీఎం జగన్ తన పాలనలో కరోనా వంటి కష్టకాలంలో సైతం పేద ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సంక్షేమ పథకాలు కొనసాగించి, నిరుపేదలకు అండగా నిలిచారన్నారు. ప్రజల కష్టాలు గుర్తించి పరిపాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను మంచి మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలని సూచించారు.

దుష్ప్రచారాలు తిప్పికొట్టండి

ఓటమి భయంతో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను ఎక్కడికక్కడ సమర్థంగా తిప్పికొట్టాలని ద్వారంపూడి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ–జనసేన–బీజేపీ అనైతిక కూటమికి ప్రజల్లో స్పందన కరవైందని, అందువల్ల వైఎస్సార్ సీపీపై బురద జల్లడమే అజెండాగా ఇక్కడి టీడీపీ అభ్యర్థి నిరాధారమైన ఆరోపణలు, దుష్ప్రచారాలతో ప్రజల్లోకి వెళ్తున్నారన్నారు. సరైన అజెండా లేకుండా అధికార పక్షాన్ని దుమ్మెత్తిపోయడమే లక్ష్యంగా సాగుతున్న ప్రతిపక్ష కుట్రలను ఎదుర్కొని, పార్టీ విజయం దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఆయా డివిజన్లలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

బూత్ కమిటీలు కీలకం

ఎన్నికల్లో బూత్ కమిటీలు, క్షేత్రస్థాయిలో కన్వీనర్లు, సారథులు, ఇతర ముఖ్యనేతలు మరింత క్రియాశీలకంగా పనిచేయాలని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. చేసిన ప్రగతిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకువెళ్లడం ద్వారా కాకినాడతో పాటు, రాష్ట్రంలో కూడా పార్టీని అఖండ విజయం దిశగా తీసుకువెళ్లవచ్చన్నారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, పెద్ద సంఖ్యలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఆర్ఎంసీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కాకినాడ క్రైం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కాకినాడ ఆర్ఎంసీ బృందం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు, ఆర్ఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు విష్ణువర్ధన్, దేవీ మాధవిల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెడిసిన్ థర్డ్ ఇయర్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీజీహెచ్ ఆవరణలో ర్యాలీ నిర్వహించి, రక్తదాన కార్యక్రమం చేపట్టారు. దాతలకు సర్టిఫికెట్లు అందించారు.

పోలింగ్ బూత్‌ల వద్ద సమృద్ధిగా మంచినీరు

ఆర్ఓ జె.వెంకటరావు ఆదేశం

కాకినాడ: ఎన్నికలకు ముందురోజు, ఆ రోజు ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పూర్తి స్థాయిలో మంచినీటి సదుపాయం కల్పించాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై శనివారం సాయంత్రం ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో సమీక్షించారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్ల వద్ద విధి నిర్వహణలో ఉండే ఎన్నికల సిబ్బందితో పాటు, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు కూడా నీరు సమృద్ధిగా అందించాలన్నారు. ఆ మేరకు ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉన్న ఆర్వో ప్లాంట్లను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన వాటర్ ప్లాంట్ల ద్వారా సమీపంలోని పోలింగ్ స్టేషన్లకు అవసరమైన మేరకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.